సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

- ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు
- పోలీస్ అకాడమీలో ప్రీ ప్రమోషనల్ శిక్షణ ప్రారంభం

శిక్షణలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): పోలీసు సిబ్బంది ఆర్థిక ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. రాజా బహద్దూర్ వెంకట రామారెడ్డి (ఆర్బీవీఆర్ఆర్) తెలంగాణ పోలీస్ అకాడమీ (టీజీపీఏ)లో మంగళవారం ప్రీ ప్రమోషనల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే డబ్బులను మంచి రాబడి వచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆర్బీవీఆర్ఆర్, టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిస్ట్ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులు, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు.

కుప్పకూలిన నిర్మాణరంగం

మొదటిపేజీ తరువాయి...

అధికారిక లెక్కలను పరిశీలించినా నిర్మాణరంగం క్రమంగా కుదేలవుతున్నదనే సంకేతాలు స్పష్టమవుతున్నాయి. రియల్ఎస్టేట్, నిర్మాణ రంగాలంటేనే శివారు ప్రాంతాలు. అలాంటిది రెండేండ్లతో పోలిస్తే చుట్టూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో నిర్మాణ అనుమతుల్లో భారీ తగ్గుదల నమోదుకావడం క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతున్నది. 2019లో ఈ రెండు రంగాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత అనూహ్యంగా కొవిడ్‌తో లావాదేవీలు, క్రయవిక్రయాలు కాస్త మందగించాయే కానీ భారీ తగ్గుదల నమోదు కాలేదు. అందుకే కొవిడ్ సమయంలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మాణ రంగానికి లాక్‌డౌన్ నుంచి మినహాయింపు ఇవ్వాల్సి వచ్చింది. కొవిడ్ అనేది రెండు రంగాలకు ఒక స్పీడ్ బ్రేకర్‌గా మాత్రమే మారింది. కానీ, దూకుడును తగ్గించలేకపోయింది. నగరం చుట్టూ ఉన్న స్థానిక సంస్థల పరిధిలో 2021, 2022 సంవత్సరాల్లో అనుమతుల సంఖ్యను చూస్తే ఇదే విషయం అర్థమవుతుంది. ప్రధానంగా 2021 నుంచి 2022కు అనుమతులు 22% మేర పెరిగాయి.

పడిపోతున్న అనుమతులు

రాష్ట్రంలో 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2024 ఆదిలో రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో కొంత మేర స్తబ్ధత నెలకొన్నా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ ఇలాగే ఉంటుందని నిపుణులు సైతం అనుకున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత హైదరాబాద్ రియల్ఎస్టేట్ నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయని చెప్పారు. హైడ్రా దూకుడుగా నిర్మాణాల కూల్చివేత చేపట్టడంతో రేపో మాపో కోలుకుంటుందనుకున్న రియల్ ఎస్టేట్-నిర్మాణ రంగాల్లో అదే స్తబ్ధత కొనసాగడంతోపాటు తగ్గుదల మొదలైంది. 2023తో పోలిస్తే 2024లో 16 స్థానిక సంస్థల పరిధిలో అనుమతులు ఏకంగా 36% తగ్గాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. దాని ఫలితంగానే రియల్టర్లు, బిల్డర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. దాని పర్యవసానంగానే నిర్మాణ రంగంలో ఆత్మహత్యలు చోటుచేసుకోవడం దురదృష్టకరం.

మున్సిపాలిటీ	2022	2023	2024
ఆదిభట్ల	141	192	294
ఆమనగల్	68	70	65
బడంగ్‌పేట్	3,335	3,605	1,320
బండ్లగూడ జాగీర్	1,248	1,321	1,147
ఇబ్రహీంపట్నం	240	166	110
జల్‌పల్లి	97	166	116
కొత్తూరు	34	31	24
మణికొండ	86	843	263
మీర్‌పేట్	1,119	358	388
నార్సింగి	152	186	193
పెద్ద అంబర్‌పేట్	245	,097	790
షాద్‌నగర్	697	609	250
శంషాబాద్	24	74	43
శంకర్‌పల్లి	367	343	212
తుక్కుగూడ	168	112	114
తుర్కయాంజాల్	363	1,627	1,620

'ఇందిరమ్మ' గైడ్‌లైన్స్‌పై కాలయాపన

- నగరాలు, పట్టణాల్లో లక్షల దరఖాస్తులు పెండింగ్
- సొంత జాగాలు లేనివారు 90% పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇంతవరకు జారీ చేయలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి గ్రేటర్ హైదరాబాద్‌లోని 25 నియోజకవర్గాలతో పాటు గ్రేటర్ వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ తదితర జిల్లాల్లోని 40 అర్బన్ నియోజకవర్గాల్లో పేదల నుంచి దాదాపు 82 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మార్గదర్శకాలు లేకపోవడంతో వాటిని పెండింగ్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తొలి దశలో జాగా ఉన్నవారికే ఇల్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు ఇంటిని పొందే అర్హత కోల్పోతున్నారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదల్లో ఎక్కువ శాతం మందికి సొంత జాగాలు లేవు. వారంతా అనాదిగా ప్రభుత్వ భూముల్లోనే గుడిసెలు, కచ్చా ఇండ్లు నిర్మించుకొని కాలం వెళ్లదీస్తున్నారు. చాలా కాలం నుంచి వారు అక్కడే ఉంటుండడంతో కరెంట్, నల్లా కనెక్షన్లు మంజూరయ్యాయి. కానీ, ఇండ్ల పట్టాలు గానీ, ఆయా జాగాలపై యాజమాన్య హక్కులు సూచించే ధ్రువపత్రాలు గానీ లేవు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 10 లక్షల మందిలో 90% మందికి సొంత జాగాలు లేవు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర పట్టణాల్లో సైతం ఇంచుమించు ఇదే పరిస్థితి ఉన్నది. దీంతో వారంతా ఇందిరమ్మ ఇల్లు పొందే అర్హత కోల్పోయినట్టే.

పట్టణాల్లో రెండు విధాలుగా ఇండ్ల నిర్మాణం

ప్రభుత్వ జాగాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి ఇవ్వ డం ఒక విధానమైతే, ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశం నుంచి పేదలను ఖాళీ చేయించి అదేచోట అపార్ట్‌మెంటు నిర్మించి అందరికీ కేటాయించడం మరో విధానం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జియాగూడ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఈ విధంగానే అపార్ట్‌మెంట్లు నిర్మించి లబ్ధిదారులకు అందించింది. ఇతర మురికివాడల్లో నివసిస్తున్నవారికి ప్రభు త్వ జాగాలు ఉన్నచోట డబుల్ బెడ్రూ మ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. ఇలా గ్రేటర్ హైదరాబాద్‌లోని లక్ష పేద కుటుంబాలకు ఇండ్లను సమకూర్చింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జాగాలు లేవనే కారణంతో పట్టణ పేదలకు ఇండ్లను మంజూరు చేయకుండా, కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తున్నది.

స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు 30 వేలు లంచం

ధారూరు, ఫిబ్రవరి 11 : లంచం తీసుకుంటూ వికారాబాద్ జిల్లా ధారూరు ఎస్సై మంగళవారం ఏసీబీకి చిక్కాడు. ధారూరు మండలం నాగసముందర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తన ప్రైవేటు డ్రైవర్ బీరప్ప ద్వారా రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు మంగళవారం రూ.30 వేలు లంచం ఇవ్వగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పరీక్షల తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): ఇంటర్, టెన్త్ పరీక్షలు ముగిసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్‌తో కలిసి ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

కుంభమేళాకు వెళ్లివస్తూ.. ఏడుగురు దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

బస్సు నుజ్జునుజ్జయ్యింది. ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. బస్సులో ఇరుక్కుపోయిన మరో ఆరుగురిని స్థానికులు బయటకు తీసి జబల్‌పూర్ మెడికల్ కాలేజీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. మినీ బస్సు వెనుక ఓ కారు కూడా ప్రమాదానికి గురైనప్పటికీ అందులో ఉన్నవారు సురక్షితంగా బయటపడినట్టు ఏఎస్పీ సూర్యకాంత్ శర్మ తెలిపారు.

నాచారంలో విషాదఛాయలు

ఈ ఘటన మృతులంతా నాచారంలోని రాఘవేంద్రనగర్, కార్తికేయ నగర్‌కు చెందినవారు. మంగళవారం తెల్లవారుజామునే బయలుదేరుతామని కుటుంబసభ్యులకు చెప్పారు. ఉదయాన్నే ప్రమాదవార్త తెలియడంతో రోదనలు మిన్నంటాయి. మృతుల్లో నవీన్, బాలకృష్ణ, సంతోష్, శశికాంత్, రవి, ఆనంద్ ఉన్నట్టు గుర్తించారు. మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ తెలిపారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణలో లోపాలు

- కొన్ని కులాలకు తీవ్ర అన్యాయం
- లోపాలు సవరించి న్యాయం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వర్గీకరణపై చర్చిస్తున్న మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం ఆయన భేటీ అయ్యారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను చిత్తశుద్ధితో చేపట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వానికి, సీఎంకు ఒక సోదరుడిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వర్గీకరణలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. అసెంబ్లీలో చర్చించి, క్యాబినెట్ సబ్ కమిటీ, న్యాయ కమిషన్లను నియమించి, నివేదికలపై క్యాబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు. లోపాలు, అభ్యంతరాలను క్యాబినెట్ సబ్ కమిటీతోపాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సీఎం సూచనల మేరకు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మందకృష్ణ చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లలో కొన్ని లోపాలున్నాయని స్పష్టంచేశారు. కొన్ని కులాలకు అన్యాయం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రధానంగా వెనుకబడిన మాదిగ కులానికి అన్యాయం జరిగిందని తెలిపారు. 'గ్రూప్ బీ'కి కేటాయించిన రిజర్వేషన్లను 9 నుంచి 11 శాతానికి పెంచాలని కోరినట్టు వివరించారు. ఎక్కువ జనాభా ఉన్న నేత కానీలను మాలలున్న సీ గ్రూప్‌లో వేయడం వల్ల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉన్నదని పేర్కొన్నారు. జనాభా తక్కువగా ఉన్న కొన్ని కులాలను మొదటి గ్రూప్‌లో చేర్చి ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని, అదే సమయంలో ఎక్కువ మంది ఉన్న బేడ బుడగ జంగాలను అత్యధికంగా వెనుకబడిన ఏ గ్రూపులో వేశారని తెలిపారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన మాలలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్లు కేటాయించారని మండిపడ్డారు. వీటితోపాటు పలు అంశాలను సీఎంతోపాటు ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి వివరించినట్టు చెప్పారు.

మహిళా పోలీసులు 4,782 మందే

ఇచ్చినట్టు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి ఒక ప్రకటనలో వెల్లడించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్‌శాఖలో అన్ని విభాగాల్లో మొత్తం 76,292 మంది అధికారులు, సిబ్బంది ఉండగా, వీరిలో మహిళా అధికారులు, సిబ్బంది 4,782 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఎస్సీ నుంచి డీజీ స్థాయి వరకు 67 మంది, కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు 3,642 మంది, ఏఆర్‌లో 1,073 మంది ఉన్నారు. మరో 868 మంది హోంగార్డులుగా ఉన్నారు. సమాచార హక్కు కింద అడిగిన ప్రశ్నకు పోలీస్‌శాఖ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం

ఎస్సార్ విజయకేతనం..

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 11: జేఈఈ ఫలితాల్లో ఎస్సార్ విద్యా సంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్టు విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లాల నాగసిద్ధార్థ(ఫిజిక్స్‌లో 99.97 పర్సంటైల్) సాధించి ఎస్సార్ కీర్తిప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టినట్టు చెప్పారు. తాడిపర్తి తేజస్ ఉద్భవ్ రెడ్డి(99.83), మారం రాజవర్షిత్‌రెడ్డి (99.81), దిడ్డి ప్రజ్వల్‌కుమార్ (99.77), యాద భరణిశంకర్ (99.77), చల్లా అన్సిక(99.66), మేడ కార్తీక్ (99.66), జోగు అభిరాం (99.60), కడారి సంజయ్ (99.58), చిన్ని కమలావర్ధన్(99.58)తోపాటు మొత్తం 25 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. విద్యార్థుల తోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

మహిళా సమాఖ్య సభ్యులతో వెదురు సాగు

– అదనపు కలెక్టర్ విద్యాచందన

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 11 : రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో జిల్లాకు వెయ్యి మంది చొప్పున 5వేల మంది మహిళా సభ్యులతో వెదురు సాగు ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్ణయించినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తెలిపారు. మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో రెండో రోజు ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెదురు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని చండ్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకోవడం జరిగిందని, ఈ మండలాల్లోని వెయ్యి మంది మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించి వారికి వెదురు సాగుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. వీరికి ఉపాధిహామీ పథకం ద్వారా మొక్కలు సరఫరా, నిర్వహణ కోసం నిధులు సమకూర్చడం జరుగుతుందన్నారు. వెదురుమొక్కలు నాటిన తర్వాత నాలుగేళ్ల నుంచి పంట వస్తుందని, 80సంవత్సరాల వరకు ప్రతి ఏడాది వెదురు దిగుబడి అమ్మడం ద్వారా రైతు ఆదాయం గడించవచ్చని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో నీలేష్, మూడు మండలాల డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, ఏపీవోలు, ఎఫ్‌పీవోలు, బీవోడీలు, ఉద్యాన అధికారులు, అటవీ అధికారులు, ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ అధికారులు రమ్య, శ్రీకాంత్, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందుపాతర పేలి జవాన్‌కు గాయాలు

మందుపాతర పేలి తీవ్రంగా గాయపడిన జవాన్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 11 : భద్రతా బలగానే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ జవాన్‌కు తీవ్ర గాయాలైన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దంతెవాడ జిల్లా అర్నపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కమల్‌పోస్టు యాంటీ నక్సల్స్ ఆపరేషన్స్‌లో భాగంగా సీఆర్‌పీఎఫ్ 231 బెటాలియన్‌కు చెందిన జవాన్లు సెర్చింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో ఓ జవాన్ మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై అడుగు వేయడంతో అది భారీ విస్ఫోటనం చెంది తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన తోటి జవాన్లు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన జిల్లా కేంద్రానికి తరలించారు.

జేవీవీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేదిక కమిటీ సభ్యులు

చుంచుపల్లి, ఫిబ్రవరి 11: జన విజ్ఞానవేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వేపల గడ్డలోని జ్యోతిరావుపూలే మైనార్టీ గురుకుల పాఠశాలలో డార్విన్ పరిణామ క్రమం ప్రచారంలో భాగంగా 150మంది విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక ప్రత్యేక ఆహ్వానితులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ మూఢనమ్మకాలు విడనాడి శాస్త్రీయ ధృక్పదం అలవర్చుకోవాలని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కస్తూరి మాట్లాడుతూ రంగురాళ్లు, విబూది చేతబడులతో కొందరు మోసగాళ్లు ప్రజలను మూఢనమ్మకాలకు గురిచేసి మోసం చేస్తున్నారని, అలాంటి మోసాలకు గురికావొద్దని వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, తిరుపారావు పాల్గొన్నారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించారు.

పురోగతి.. తిరోగమనమేనా..?

- సీసీ కెమెరాల ఏర్పాటులో వైఫల్యం
- రెండువారాలు దాటిన అంతుచిక్కని 'నవభారత్' చోరీ కేసు
- కేజీకిపైనే బంగారు ఆభరణాలు, రెండు కేజీలపైన వెండి, లక్షల్లో నగదు..!
- ఎంపీ దొంగల పనేనని భావిస్తున్న పోలీస్ అధికారులు?

నవనగర్‌లో జరిగిన చోరీ ఘటనకు సంబంధించిన దృశ్యాలు (ఫైల్)

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఫిబ్రవరి 11 : లక్ష కాదు.. రెండు లక్షలు కాదు.. సుమారు రూ.కోటిన్నర విలువ చేసే సొత్తును దొంగలు దొరికిన కాడికి దోచుకుపోయారు.. రెండున్నర వారాలు గడుస్తున్నా ఇప్పటివరకు కేసులో పురగతి లేనట్లు తెలుస్తోంది.. ఒకవైపు ఇంటి యజమానులు ఏమరపాటు.. మరోవైపు యాజమాన్యం 'భద్రత'లో నిర్లక్ష్యం భారీ నష్టాన్ని చవిచూపించాయి.. వివరాల్లోకి వెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మండలం నవభారత్ వెంచర్స్‌కి చెందిన నవనగర్ కాలనీలో గత నెల 26వ తేదీన తెల్లవారుజామున భారీ చోరీ జరిగిన సంఘటన పాఠకులకు విదితమే. అయితే ఈ ఘటనపై విచారణ జరుపుతున్న పోలీసులకు ఈ కేసు ఒక సవాల్‌గా మారినట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తులో ఈ ఘటనకు పాల్పడింది మధ్యప్రదేశ్‌కి చెందిన 'ధార్ గ్యాంగ్' దొంగల ముఠా అనే అనుమానాలు తలెత్తాయి. దీంతో పోలీస్ అధికారులు ఒక టీమ్‌గా ఏర్పడి ఎంపీకి వెళ్లి దొంగల ముఠా కోసం విచారణ జరిపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పురోగతి సాధించేందుకు వెళ్లిన మన పోలీసులు ఖాళీ చేతులతో వచ్చినట్లు సమాచారం. నవనగర్ కాలనీ చోరీ కేసు తరహాలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాలో మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ గ్యాంగ్ 20రోజుల క్రితం పలు ఇళ్లలో చోరీకి పాల్పడి సుమారు రూ.2.80 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు. అక్కడి పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, 4 బృందాలుగా ఏర్పడి ఈ కేసుని అతివేగంగా ఛేధించడంతోపాటు దొంగలను అదుపులోకి తీసుకుని సుమారు రూ.కోటి విలువ చేసే ఆభరణాలను రికవరి చేశారు. ఇదే గ్యాంగ్‌కు చెందిన సభ్యులు పాల్వంచలో సైతం చోరీకి పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తం అయినప్పటికీ ఇంతవరకు ఈ కేసులో ఎలాంటి పురోగతి లేకపోవడం గమనార్హం. అయితే ఈ చోరీ ఘటనలో ఫింగర్ ప్రింట్స్‌తో పాటు మరిన్ని ఆధారాలను సేకరించి ఈ కేసులో దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

సీసీ కెమెరాలు, సెక్యూరిటీ వైఫల్యం..!

జిల్లాలో ఆదాయ వనరుల్లో ఒకటిగా పేరుగాంచిన నవభారత్ వెంచర్స్‌కి చెందిన నవనగర్ కాలనీలో నివసించే అధికారులు, ఉద్యోగుల సొత్తుకు భద్రత కరువైంది. నవనగర్ కాలనీ పరిస్థితి 'పైన పటారం.. లోన లొటారం' చందంగా బయటికే అన్ని హంగులతో సెక్యూరిటీ కనిపించినప్పటికీ ఆ కాలనీలో దొంగలు పడి సుమారు 9 ఇళ్లలో చోరీకి పాల్పడడంతో డొల్లతనం తేటతెల్లమైపోయింది. భారీ విస్తీర్ణంలో గేటెడ్ కమ్యూనిటీ తరహాలో చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసిన నవనగర్ కాలనీకి పెద్ద సంఖ్యలోనే సెక్యూరిటీ సిబ్బంది కేటాయించారు. ఈ కాలనీలో షిఫ్టుకి కనీసం పది మందిపైనే గస్తీ నిర్వహిస్తున్నారు. అయితే కాలనీ ఎంట్రన్స్‌తో పాటు, నవభారత్ స్కూల్, ప్రైమరీ స్కూల్ వద్ద మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం దొంగలకు మంచి అవకాశంలా దొరికింది. కాలనీలోకి వచ్చి వెళ్లే వారిపై నిఘా లోపం వల్లే ఈ చోరీ జరిగిందనడం అతిశయోక్తి కాదు. ఈ ఘటనలో ప్రధానంగా బాధితుడు ప్రతాప్‌కి చెందిన ఓల్డ్-బి 11 క్వార్టర్‌లో 64తులాల బంగారం, కేజీకిపైనే వెండి, మరో బాధితుడు విజయ్ ప్రకాశ్‌కి చెందిన ఎన్‌బీ-47 క్వార్టర్‌లో సుమారు 30తులాల బంగారం, 60తులాల వెండి, సుమారు రూ.4లక్షల నగదు, మిగతా బాధితుల క్వార్టర్స్‌లో అధిక మొత్తంలోనే సొత్తుని దొంగలు అపహరించుకువెళ్లారు. ఇదంతా కేవలం సెక్యూరిటీ సంస్థ వైఫల్యం, సీసీ కెమెరాల ఏర్పాటు నిర్లక్ష్యంతో పోలీసులకు ఈ కేసు ఛేధన ఒక ఛాలెంజ్‌గా మారింది. చోరీ జరిగి రెండున్నర వారాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు సీసీ కెమెరాల ఏర్పాట్లు నత్తనడకన నడుస్తుండడం శోచనీయం. సొమ్ము పోగొట్టుకున్న బాధితులు ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో ఈ కేసులో పోలీసులు ఎలాంటి పురోగతి సాధించనున్నారో వేచిచూడాల్సి ఉంది.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్

దమ్మపేట పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్

దమ్మపేట, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి(డీఎంహెచ్‌వో) భాస్కర్‌నాయక్ సూచించారు. మంగళవారం దమ్మపేట లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వార్డులను కలియతిరిగారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. అనంతరం మండలంలో ఉన్న రక్తపరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మండలపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శ్రీవిజయ సాయి మెడికల్‌షాపులో ఆర్ఎంపీ ప్రాక్టీస్ చేస్తూ అధిక మోతాదు యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించి క్లినిక్‌ను సీజ్ చేశారు. తనిఖీల్లో జిల్లా చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్ అధికారి బాలాజీనాయక్, మండల వైద్యాధికారి మణిదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్ల ధరల పట్టిక ఏకరీతిగా ఉండాలి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 11 : క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లలో ల్యాబ్ ఇన్వెస్టిగేషన్ ధరల పట్టిక ఏకరీతిగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ మైక్రోబయాలజిస్టు డాక్టర్ చంద్రకళ, డాక్టర్ రత్నమణి, బయో కెమిస్ట్ డాక్టర్ తిరుపతి, పాథాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఐఎంఏ ప్రతినిధులు, ల్యాబ్ టెక్నిషియన్ సంఘ ప్రతినిధులు, ప్లేక్ సలీమ్, వీరభద్రరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిద్రపో తల్లీ.. మళ్లీ వస్తా..!

- కలెక్టరేట్‌లో చీరెతో ఊయల కట్టి ట్రైనిం